క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ సీజ్

నాగులుప్పలపాడు (మద్దిపాడు): మండలంలోని చదలవాడ సమీపంలో గుండ్లకమ్మ నదీ పరీవాహక ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఎస్ఐ బి. శ్రీకాంత్ సీజ్ చేసి నాగులుప్పలపాడు స్టేషన్‌కు తరలించారు. మైనింగ్ డిపార్ట్‌మెంట్‌వారికి సమాచారం ఇచ్చినట్లు ఎస్ఐ తెలిపారు.

ఖాతాదారుల నమ్మకమే పెట్టుబడి

ఒంగోలు సిటీ: ఖాతాదారుల నమ్మకమే పెట్టుబడి అని దసిటిజన్ కో ఆపరేటివ్ సొసైటీ సభ్యులు పేర్కొన్నారు. గురువారం ఒంగోలులోని మౌర్య ఇన్‌కాంప్లెక్సులో కో ఆపరేటివ్ సొసైటీ మెంబర్ల సమావేశం నిర్వహించారు. చైర్మన్ పీఆర్‌వీపీఎస్ రాజు మాట్లాడుతూ ఖాతాదారుల నమ్మకంతో ప్రతి ఏడాది సొసైటీ దినదినాభివృద్ధి చెందుతోందన్నారు. మేనేజరు కె.ఆంజనేయులు, నెప్పలి సుబ్బరామయ్య, మండలి సుబ్బయ్య, కారుమంచి బాదరయ్య పాల్గొన్నారు.

దరిమడుగు ఆరోగ్య ఉపకేంద్రం తనిఖీ

సాక్షి ఎఫెక్ట్..

మార్కాపురం రూరల్: మండలంలోని దరిమడుగు గ్రామంలో ఆరోగ్య ఉప కేంద్రాన్ని గురువారం హెల్త్ సూపర్‌వైజర్ నాగేంద్ర రెడ్డి తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో లేకపోవడంపై 'సిబ్బంది ఇలా.. వైద్యసేవలు ఎలా' అనే శీర్షికన గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఆరోగ్య ఉపకేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. వైద్య సిబ్బంది తిప్పాయపాలెం పీహెచ్‌సీలో సమావేశానికి వెళ్లారని, మరోసారి ఇలాంటివి జరగకుండా జాగ్రత్త వహిస్తామని చెప్పారు. గ్రామంలో వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో రోజూ వైద్యసేవలు అందించేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. వైద్యశాల పరిసర ప్రాంతాల్లో ఆకతాయిలు మద్యం సేవిస్తున్న విషయాన్ని పోలీసులకు తెలియజేశామన్నారు.

రేపు రామదూత క్షేత్రంలో శనీశ్వరునికి పూజలు

కొనకనమిట్ల: మండల కేంద్రమైన కొనకనమిట్ల సమీపంలోని రామదూత క్షేత్రంలో శనివారం శని త్రయోదశి సందర్భంగా శనీశ్వరునికి అష్టోత్తర శత కలశాభిషేకం, అలంకరణ, శాంతి హోమాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు అకలంకం వెంకటరామకృష్ణాచార్యులు, యక్కంటి తిరుపతిరెడ్డి తెలిపారు. ఉభయదాతల పర్యవేక్షణలో శనీశ్వరునికి తైలాభిషేకం వైభవంగా నిర్వహిస్తారని, భక్తులందరూ పాల్గొనాలని కోరారు.



ఇటువంటి దారుణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి

కోల్‌కతా కేసులో దృశ్యాలు చూసి కంట నీరు వచ్చింది. దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వైద్య సిబ్బందికి రక్షణ కల్పిస్తామన్న భరోసా ప్రభుత్వాలు కల్పించాలి. అలాగే తప్పకుండా సెక్యూరిటీ ఏర్పాటు చేయాలి. అలాంటి సమయంలోనే మేము ధైర్యంగా ఉద్యోగాలు చేయగలం.

– డాక్టర్ శిరీష, మద్దిపాడు పీహెచ్‌సీ



భద్రత పెంచాలి

చీమకుర్తి శివారు ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో డాక్టర్‌లు, మహిళా సిబ్బందికి భద్రత మరింత పెంచాలి. సంతనూతలపాడు మండలం వేములపాడు పీహెచ్‌సీ మండల కేంద్రానికి దూరంగా ఉంటుంది. ఇక్కడ పోలీస్ కానిస్టేబుల్‌ను కూడా నియమిస్తే పనిచేసే వైద్య సిబ్బందికి ధైర్యంగా ఉంటుంది. అత్యవసర, ప్రమాదకర పరిస్థితుల్లో ఫోన్ చేసినప్పుడు పోలీస్ సిబ్బంది తక్షణమే స్పందిస్తే మహిళా వైద్య సిబ్బందికి నష్టం జరగకుండా ఉంటుంది.

– డాక్టర్ బి. శ్రావ్య, వేములపాడు పీహెచ్‌సీ, సంతనూతలపాడు మండలం



పల్లెల్లో పల్లీ ఖుషీ!



సాగుబడి చేస్తున్న వేరుశనగ పైరు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న వేరుశనగ కాయలు

- రెట్టింపు పలికిన ధర
- మండలంలో 1,200 ఎకరాల్లో సాగు

కొత్తపట్నం: వేరుశనగ రైతుల్లో ఆనందం వెల్లివిరిస్తోంది. కష్టానికి ఫలితంగా ధర రెట్టింపు పలకడంతో రైతుల్లో ఉత్సాహం నెలకొంది. ఎప్పుడూ లేనంత విధంగా ధర పెరిగింది. మండలంలో సగటున 1,200 ఎకరాల్లో వేరుశనగ సాగుబడి చేస్తారు. ఎక్కువ మంది రైతులు ట్రాక్ 24 రకాన్ని ఎన్నుకుని సాగుబడి చేస్తారు. అధిక దిగుబడులు రావడమే కాక ధర అనుకూలకంగా ఉంటుంది. అందుకే మార్కెట్‌లో ఎక్కువ మంది కొనుగోలు చేస్తారు. జిల్లాలో తీర ప్రాంతాలైన చీరాల, వేటపాలెం, కొత్తపట్నం, పాకల మండలాల్లో ఇసుక నేలల్లో సాగుబడి చేస్తారు. జిల్లాలో కొత్తపట్నంలో 1.200 ఎకరాలు సగుబడి చేస్తారు. జిల్లా మొత్తం మీద అయితే కొత్తపట్నం మండలంలో ఎక్కువ సాగు చేస్తారు. ఇసుక నేలల వల్ల దిగుబడులు ఎక్కువ వస్తాయి. అంతే కాక బోర్లు ఉన్నందున నీరు సమృద్ధిగా ఉండి సాగుబడికి అనుకూలంగా ఉంటుంది. ట్రాక్ 24 రకం వచ్చిన తరువాత ఇసుక పొలాలకు ధర కూడా పలికింది. ఎకరానికి సాగు చేయాలంటే రూ.35 వేల నుంచి రూ. 40 వేల దాకా ఖర్చు అవుతుంది. ఏడాదిలో ఇసుక నేలల్లో మూడు సార్లు వేరుశనగ పంట పండిస్తారు.

జీడి పప్పులా డిమాండ్

జీడి పప్పుకు మంచి అంటే నోరు ఊరని వారుండరు. అన్ని వంటకాలాల్లో జీడి పప్పు వినియోగిస్తారు. అయితే ప్రస్తుతం ఏ వంటకాల్లో చూసినా



మంచి కాపు కాసిన వేరుశనగ మండీలు

వేరుశనగ పప్పు కూడా కనిపిస్తోంది. ఆరోగ్యంగా ఉండటానికి బెల్లంతో తయారు చేసిన వేరుశనగ ఉండలు తింటారు. పచ్చి కాయలను ఉడికించి తింటారు. అలాగే చట్నీ.. ఉప్మా.. పులిహోర ఇలా అన్నింటిలోనూ వేరుశనగకు చోటు ఉంటుంది. అందుకే చిన్నా పెద్దా అందరికీ పల్లీలంటే ఇష్టం.

కూలీలకు ఉపాధి

ఏడాదిలో వేరుశనగ పంట మూడు సార్లు వేయటం వలన కూలీలకు ఉపాధి దొరుకుతుంది. కూలీలకు కూడా గిట్టుబాటు అవుతుంది. దూర ప్రాంతాలకు వలస పోకుండా ఉన్న ఊరులోనే పని దొరుకుతుంది. ఎంత మందికైనా ఉపాధి లభిస్తుంది. పని కూడా చాలా సులభంగా ఉంటుంది.

కష్టాలు పోయే..

గత ఏడాది కంటే ఈ ఏడాది ధర రెట్టింపు అయ్యింది. 39 కేజీల బ్యాగ్ గత ఏడాది రూ.1000 నుంచి రూ.1,300 ఉండేది ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రూ.2,600 నుంచి రూ.2,800 దాకా పలుకుతోంది. నూనె శాతం ఎక్కువగా ఉంటే రూ.3 వేల దాకా విక్రయిస్తాన్నారు. ఒక ఎకరాకు పెట్టుబడి పోను మండలంలో ఏడాదిలో సగటున 1200 ఎకరాలు సాగుబడి చేయగా 45 వేల బస్తాలు ఉత్పత్తి అవుతున్నాయి. ఎక్కువ శాతం మహారాష్ట్ర, చెన్నై, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. ఇంకా పెరిగే అవకాశం కనిపిస్తున్నాయని వ్యాపారులు అంటున్నారు. మెరుగైన వేరుశనగ నిల్వ గిడ్డంగులు ఉంటే నిల్వ చేసుకుని అమ్ముకునే అవకాశం ఉంటుంది.

టీడీపీ ప్రభుత్వంలో రైతు భరోసా శూన్యం

జిల్లాలో ఎక్కువ మంది చిన్న, సన్నకారు రైతులు వేరశనగ పంటలు పండిస్తారు. వైఎస్సార్ ప్రభుత్వంలో ఐదు సంవత్సరాలు రైతు భరోసా పడటం వలన దుక్కులకు, విత్తనాలకు, ఎరువులకు అవసరాలకు పనికొచ్చాయి. టీడీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఇంత వరకు రైతు భరోసా పడలేదు. అప్పులు తెచ్చుకుని వడ్డీలకు వడ్డీలు చెల్లించడంతో వచ్చే లాభం పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వేరు శనగ పైరు తీస్తున్న కూలీలు

ఏడాదికి మూడు సార్లు వేరుశనగ పంట సాగు



వేరుశనగ కాయలకు ధర రెట్టింపు కావడంతో ఏడాదికి మూడు సార్లు పంట వేస్తున్నాం. శాస్త్రీయ పద్ధతిలో, వ్యవసాయ సూచనలు తీసుకొని సాగుబడి చేయటం వల్ల దిగుబడి బాగానే వస్తోంది. నేను రెండు ఎకరాలు సాగుబడి చేయగా 90 బస్తాలయ్యాయి. గత ఏడాది కంటే ఈ ఏడాది ధర రెట్టింపు అయ్యింది. దీనికి తోడు వాతావరణం అనుకూలంగా ఉన్నందున అధిక దిగుబడులు వచ్చాయి.

– గుడి నాగిరెడ్డి, పాదర్తి

వాతావరణం అనుకూలించింది



నాకు ఒక ఎకరా సొంత భూమి ఉంది. వాతావరణం అనుకూలించడం వలన దిగుబడి బాగానే వచ్చింది. 40 నుంచి 45 బస్తాలు అయ్యే అవకాశం ఉంది. మూడు నెలలు పెంచి ఈ రోజే తీస్తున్నాం. ధర కూడా అనుకూలంగా ఉంది.

– బి.కోటేశ్వరమ్మ, పాదర్తి

ఉత్సాహంగా జాతీయ క్రీడా దినోత్సవం



అపెక్స్ స్కూలులో క్రీడా దినోత్సవాన్ని ప్రారంభిస్తున్న గోరంట్ల రవికుమార్



క్విస్ కాలేజీలో మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ వైవీ హనుమంతరావు

ఒంగోలు: స్థానిక సుజాత నగర్‌లోని అపెక్స్ ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవం గురువారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ప్రకాశం జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ చైర్మన్ గోరంట్ల రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలలో లక్ష రూపాయలకంటే ఎక్కువ విలువైన క్రీడా పరికరాలతో పాటు చెస్, క్యారమ్స్ పోటీలను ఆయన ప్రారంభించారు. అంతర్జాతీయ క్రీడాకారులు రాఘవేంద్ర, కుమారి సుప్రజలను ఘనంగా సత్కరించారు. ఆత్యాపాత్యా అసోసియేషన్ జిల్లా అధ్యక్షునిగా నంబూరి శ్రీనివాసరావు, జిల్లా చైర్మన్‌గా ఎస్‌కే బాషా, కార్యదర్శిగా పి.డేవిడ్, కోశాధికారిగా శివారెడ్డిని రాష్ట్ర కార్యవర్గం ప్రకటించిందని పేర్కొంటూ నూతన కార్యవర్గ సభ్యులను అభినందించారు. ఒక పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు.

క్విస్ కాలేజీలో..

స్థానిక క్విస్ కాలేజీలో క్విస్‌సెట్ పీడీ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వాలీబాల్, కబడ్డీ వంటి అనేక పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా క్విస్ విద్యా సంస్థల అధినేత నిడమానూరి సూర్య కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ విద్యార్థులు మేజర్ ధ్యాన్ చంద్ వంటి వారిని స్ఫూర్తిగా తీసుకుని క్రీడల్లో రాణించాలన్నారు. గెలుపు, ఓటములు సహజమని, కానీ క్రీడా స్ఫూర్తి మాత్రం ముఖ్యమన్నారు. అనంతరం విజేతలకు ప్రిన్సిపాల్ వైవీ హనుమంతరావుతో కలిసి అవార్డులు, ప్రశంస పత్రాలు అందించి అభినందించారు.



పేర్నమిట్ట హైస్కూల్‌లో విద్యార్థులకు క్రీడాసామగ్రిని అందిస్తున్న దాతలు

చీమకుర్తి: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా శుక్రవారం చీమకుర్తి, సంతనూతలపాడు మండలాల్లోని పలు ప్రభుత్వ హైస్కూళ్లలో టీచర్‌లు, విద్యార్థులతో కలిసి క్రీడాదినోత్సవం నిర్వహించారు. చీమకుర్తి జిల్లాపరిషత్ బాలికల హైస్కూలులో స్థానిక టీచర్‌లు ఆధ్వర్యంలో చీమకుర్తి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పేర్నమిట్ట జిల్లా పరిషత్ హైస్కూలులో స్థానిక దాదలు కందుకూరి బాబు, కరిచేటి శ్రీనివాసుల ఆర్థిక సహకారంతో విద్యార్థులకు క్రీడా సామగ్రిని మరియు మెరిట్ స్కాలర్‌షిప్‌లను అందించారు.



ర్యాలీ నిర్వహిస్తున్న చీమకుర్తి జెడ్పీ హైస్కూల్ బాలికలు

ప్రజా పద్దుల సమీక్షలో మాగుంట

ఒంగోలు సబర్బన్: పార్లమెంట్ ప్రజా పద్దుల కమిటీ (పీఏసీ) సమీక్ష సమావేశంలో కమిటీ సభ్యులు, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు. స్థానిక ఢిల్లీలోని పార్లమెంట్ భవనంలో గురువారం పీఏసీ చైర్మన్ కేసీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్షకు మాగుంట హాజరయ్యారు. ఈ సందర్భంగా మాగుంట మాట్లాడుతూ పార్లమెంట్‌లో వివిధ రకాల పద్దులపై సమీక్ష నిర్వహించినట్లు పేర్కొన్నారు.

ఐఓసీ డిపో కొనసాగించండి

ఒంగోలు సబర్బన్: జిల్లాలోని హైవేలో సూరారెడ్డిపాలెం వద్ద ఉన్న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ)డిపోను యథావిధిగా కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి కోరారు. ఈ మేరకు ఎంపీ మాగుంట ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వ పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ విభాగం సెక్రటరీని గురువారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.

ఇటీవల ఐఓసీ డిపోను సూరారెడ్డి పాలెం నుంచి తరలించేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక కమిటీ వచ్చి పరిశీలించి వెళ్ళిన విషయం విదితమే. అందులో భాగంగా ఎంపీ మాగుంట కేంద్ర ప్రభుత్వానికి చెందిన అధికారులను కలిశారు.

22న హలో మాల.. చలో ఒంగోలు

ఒంగోలు: మాల సంఘాలు , దళిత సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 22న ఒంగోలులో హలో మాల..ఛలో ఒంగోలు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు అన్నారు. గురువారం స్థానిక అంబేద్కర్ గ్రంథాలయంలో జైజనం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు చప్పిడి రవిశంకర్ అధ్యక్షతన అంబేద్కర్ గ్రంథాలయంలో హలో మాల.. చలో ఒంగోలు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన క్రీమీ లేయర్ తీర్పును రద్దు చేయాలని కోరుతూ ఈ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నాడు ఎస్సీ వర్గీకరణ జీవోను వ్యతిరేకిస్తూ 1997 ఆగస్టు 11న లక్షలాది మాలలతో సచివాలయం ముట్టడి చేయగా.. గోపతోటి నారాయణ, పానంకి శేషయ్య అమరులయ్యారన్నారు. ఈ ఉద్యమం ప్రపంచంలోనే అత్యంత చారిత్రక ఘట్టం అన్నారు. చట్టాలు, తీర్పులపై అవగాహన లేని కొందరు మనువాదులు ఎస్సీ, ఎస్టీలను అధికారానికి దూరంగా ఉంచేందుకు వేస్తున్న పాచికలకు కొందరు నేతలు పావులుగా ఉపయోగపడుతున్నారని విమర్శించారు. సుప్రీంకోర్టు తీర్పుపై మాల మహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు దాఖలు చేసిన రివ్యూ పిటీషన్ దాఖలైందన్నారు. దళిత కవి చప్పిడి కోటేశ్వరరావు, సంపత్‌కుమార్ చిట్టిమాల, యరజర్ల రమేష్, అంచిపోగు కోటేశ్వరరావు, శ్రీరామ్ రాజేష్, చవల పీటర్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చప్పిడి వెంగళరావు తదితరులు

లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్‌గా శంకర్

చీమకుర్తి: లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కన్వీనర్‌గా చీమకుర్తికి చెందిన ఇస్తర్ల శంకర్‌ను నియమించినట్లు ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, రిటైర్డ్ కలెక్టర్ విజయకుమార్ తనను నియమించినట్లు శంకర్ తెలిపారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూడా శంకర్ సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గం తరపున పోటీ చేసిన సంగతి తెలిసిందే.

ప్రకృతి వ్యవసాయంతో దిగుబడులు

కొత్తపట్నం: ప్రకృతి వ్యవసాయంతో మేలైన దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు అన్నారు. గురువారం రంగాయపాలెం, కె.పల్లెపాలెంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయ్ కుమార్, ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వి.సుభాషిని తదితర అధికారులు పాల్గొన్నారు.

1న అండర్- 14 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక

ఒంగోలు: ప్రకాశం జిల్లా అండర్ -14 బాలుర జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక సెప్టెంబర్ 1న మంగమూరు రోడ్డులోని అసోసియేషన్ సబ్ సెంటర్ నెట్స్‌లో నిర్వహిస్తున్నట్లు ప్రకాశం జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కారుసాల నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబరు 1వ తేదీ నుంచి కడప/అనంతపురం జిల్లాలో జరిగే ఆంధ్రక్రికెట్ అసోసియేషన్ అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొనాలని తెలిపారు. వివరాలకు 9701022333, 9246222999 నంబర్లను సంప్రదించాలన్నారు.



గాంధీ పార్కు దగ్గర నివాళులర్పిస్తున్న సాహిత్యవేతలు కవులు



ప్రముఖులను సత్కరించిన కళా మిత్రమండలి సభ్యులు



మాంటిస్సోరి స్కూలులో మాతృభాషా దినోత్సవం

- ఘనంగా మాతృభాషా దినోత్సవం

తీయనైన తెలుగు మాట

ఒంగోలు: నగరంలోని పలు విద్యా సంస్థల్లో మాతృభాషా దినోత్సవ కార్యక్రమాలు గురువారం ఘనంగా జరిగాయి. స్థానిక మాంటిస్సోరి స్కూలులో పాఠశాల కరస్పాండెంట్ శబరీనాథ్, ప్రిన్సిపాల్ నూరుద్దీన్‌లు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామమూర్తి పంతులుతోపాటు భారత హాకీ క్రీడా మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చిన్నారులు బుర్రకథ ద్వారా గిడుగు రామమూర్తి పంతులు జీవిత చరిత్ర వివరించారు. ఏడో తరగతి విద్యార్థిని మీనాక్షి తెలుగుతల్లి వేషధారణలో నృత్య ప్రదర్శన చేసి అలరించారు. ఈ సందర్భంగా తెలుగు భాష ఔన్నత్యాన్ని గురించి ఉపాధ్యాయులు వివరించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు.

పింగళి కోదండరామయ్య సంస్కృతాంధ్ర పాఠశాలలో..

స్థానిక గద్దలగుంటలోని శ్రీపింగళి కోదండరామయ్య సంస్కృతాంధ్ర పాఠశాలలో తెలుగుభాషా దినోత్సవం తోపాటు జాతీయ క్రీడా దినోత్సవం జరిగింది. సరైన దేహంలో సరైన మెదడు ఉంటుందని, విద్యార్థులంతా చదువుతోపాటు ప్రతిరోజూ వ్యాయామం చేస్తూ ఆరోగ్యవంతులుగా ఉండాలని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు సోమినేని సురేష్ పిలుపునిచ్చారు. బాగా చదవాలంటే సరైన మనస్సు ఉండాలని, దానికి కచ్చితంగా ప్రతి ఒక్కరూ రోజుకు 30 నిమిషాలు వ్యాయామం చేయాలని సూచించారు. పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు చంద్రశేఖర్ మాట్లాడుతూ పర భాష నేర్చుకోవడంలో తప్పులేదు కానీ.. మాతృభాషలో ప్రావీణ్యం తప్పనిసరిగా ఉండాలన్నారు. గిడుగు రామమూర్తి పంతులు గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిడమానూరి శ్రీకాంత్‌తోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఎన్ డిగ్రీ కాలేజీలో..

స్థానిక మంగమూరు రోడ్డులోని ఎస్ఎస్ఎన్ డిగ్రీ కాలేజీలో జాతీయ సేవా పథకంలో భాగంగా మాతృభాషా దినోత్సవం ఘనంగా జరిగింది. కాలేజీ కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ వై.సత్యన్నారాయణరెడ్డి మాట్లాడుతూ గ్రాంథిక భాషా సుడిగుండంలో చిక్కుకున్న తెలుగు భాషను వ్యవహారిక భాషగా అందుబాటులోకి తెచ్చిన మహనీయుడు అని కొనియాడారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు టి.రాజేంద్రబాబు, టి.రాజశేఖర రెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో..

స్థానిక దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో తెలుగుభాషా దినోత్సవం ఘనంగా జరిగింది. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి మాట్లాడుతూ ఢిల్లీకి రాజైన అమ్మకు కొడుకే అన్నట్లుగా తెలుగుభాష ప్రాముఖ్యతను వివరించారు. గ్రాంథిక భాషకు బదులుగా వాడుకభాషను అందుబాటులోకి తీసుకువచ్చిన మహనీయుడు గిడుగు రామమూర్తి పంతులు అని పేర్కొంటూ ఆయన ఘనతను వివరించారు. అకడమిక్ కౌన్సిల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఇంట గెలిచి రచ్చ గెలిచినట్లుగా ముందుగా మాతృభాషలో ప్రావీణ్యం సంపాదించుకుని దాని ఆధారంగా ఇతర భాషలు నేర్చుకోవాలన్నారు.


చీమకుర్తి: తెలుగు భాష ఖ్యాతి అనన్యమని ట్రిపుల్ ఐటీ కాలేజీ డైరెక్టర్ భాస్కర్‌పటేల్ అన్నారు. శుక్రవారం సంతనూతలపాడులోని ట్రిపుల్ ఐటీ కాలేజీలో గిడుగు వెంకట రామమూర్తి జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని ట్రిపుల్ ఐటీ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని మేజర్ ధ్యాన్‌చంద్, గిడుగు వంకట రామమూర్తి చిత్రపటాలకు పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. సంతనూతలపాడు జిల్లా పరిషత్ హైస్కూలులో నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవ వేడుకల్లో స్థానిక ప్రధానోపాధ్యాయులు, టీచర్‌లు పాల్గొన్నారు.

ఒంగోలు మెట్రో: గ్రాంధిక భాషా పదబంధాల మధ్య చిక్కుకున్న తెలుగు భాషను ప్రజల భాషగా తీర్చిదిద్దేందుకు పోరాటం చేసిన వాడుకభాష ఉద్యమ పిడుగు గిడుగు రామమూర్తి పంతులు అని ప్రకాశంజిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు వేంకట శ్రీనివాసులు అన్నారు. రంగారాయుడు చెరువు దగ్గర గాంధీపార్కు వద్ద ఉన్న తెలుగుతల్లి, తాళ్లపాక అన్నమయ్య, శ్రీకృష్ణదేవరాయల విగ్రహాలకు నివాళులర్పించారు. ఈ విగ్రహాలు ఏర్పాటు చేసిన లలిత కళా అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావును సత్కరించారు. నాదెండ్ల జ్వాలా ఉమామహేశ్వర శర్మ, షేక్‌మహబూబ్ జాన్, పాలూరి శివప్రసాద్, పొన్నలూరి జానకిరామ్, తదితరులు పాల్గొన్నారు.


కళా మిత్రమండలి ఆధ్వర్యంలో..

కళామిత్రమండలి జాతీయ అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మ రావు స్థానిక గుంటూరు రోడ్డులోని ఫ్లై ఓవర్ కింద ఉన్న తెలుగు తల్లి విగ్రహం వద్ద కళామిత్రమండలి, నరసం ఆధ్వర్యంలో జరిగిన తెలుగు భాషా దినోత్సవ సభకు నరసం గౌరవాధ్యక్షురాలు తేళ్ళ అరుణ అధ్యక్షత వహించారు. వివిధ సాహితీ సాంస్కృతిక కళా రంగాలకు చెందిన ప్రముఖులను సత్కరించారు. ప్రముఖ సాహితీవేత్త నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, శ్రీకుర్రా ప్రసాద్ బాబు, నూకతోటి శరత్ బాబు, మిడసల మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.


ఒంగోలు సెంట్రల్: భాషా ఉద్యమానికి మూల పురుషుడు గిడుగు రామ్మూర్తి అని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె. ఆదిలక్ష్మి అన్నారు. జిల్లా గ్రంథాలయంలో గ్రంథపాలకురాలు, కార్యదర్శి, ఉపకార్యదర్శి కోటేశ్వరితో కలిసి గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి వేసినివాళులర్పించారు. విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పేరయ్య మాట్లాడుతూ పండితులకు పరిమితమైన సాహిత్య సృష్టి , సృజనాత్మక శక్తి గిడుగు రామూర్తి సొంతం అయిందన్నారు. సిబ్బంది సంపూర్ణమ్మ, సందీప్, ఇస్మాయేలు, శాంసన్, క్రిష్ణవేణి, మృదుల్ కుమార్ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదిలక్ష్మి



ఎస్ఎస్ఎన్ డిగ్రీ కాలేజీలో మాతృభాషా దినోత్సవం



నివాళులర్పిస్తున్న ట్రిపుల్ ఐటీ కాలేజీ డైరెక్టర్, అధ్యాపకులు, విద్యార్థులు



సంతనూతలపాడు జిల్లాపరిషత్ హైస్కూలులో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



పింగళి కోదండరామయ్య సంస్కృతాంధ్ర పాఠశాలలో..



డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో..